క్లుప్తంగా

ప్రైవేటు స్కూళ్లలో ఉచిత విద్య కోసం దరఖాస్తు చేసుకోవాలి

నాగులుప్పలపాడు/మద్దిపాడు/కొత్తపట్నం: విద్యా హక్కు చట్టం ప్రకారం బడుగు బలహీనవర్గాల పిల్లల కోసం అన్ని ప్రైవేట్, అన్ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నాగులుప్పలపాడు ఎంఈఓలు టి.రవి, ఈవీ రమణయ్య, మద్దిపాడు ఎంఈఓ–2 మెడబలిమి శ్రీనివాసరావు, కొత్తపట్నం ఎంఈవో–2 టి.పద్మావతి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 25 శాతం సీట్లను బడుగు బలహీనవర్గాల పిల్లలకు ఉచితంగా కేటాయించాలని తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో సీబీఎస్ఈ స్టేట్ సిలబస్ అనుసరిస్తున్న పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2019 ఏప్రిల్ 2 నుంచి 2020 మే 30వ తేదీ మధ్య జన్మించి ఐదేళ్లు నిండిన బాలలు అర్హులని తెలిపారు. మే 2 నుంచి 19వ తేదీ వరకు సచివాలయాలు, మీ సేవా సెంటర్లలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సీతారాంపురంలో నేడు విద్యుత్ అంతరాయం

ఒంగోలు సబర్బన్: నగరంలోని సీతారాంపురం ఏరియాలో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఒంగోలు నగర విద్యుత్‌శాఖ డీఈఈ కేవీ పాండురంగారావు తెలిపారు. 11 కేవీ సీతారాంపురం ఏరియా ఫీడర్‌లో విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లకొమ్మలు కొట్టేయటం, విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. సీతారాంపురంతో పాటు శర్మ కళాశాల పరిసర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

బాధ్యతలు స్వీకరించిన మద్దిపాడు తహసీల్దార్



తహసీల్దార్ నారాయణరెడ్డికి పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న వీఆర్‌ఓలు

మద్దిపాడు: మండల తహసీల్దార్‌గా ఎస్ఎల్ నారాయణరెడ్డి శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు, పలు పార్టీల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖ పరంగా వచ్చే సమస్యలను సానుకూలంగా పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని, సిబ్బంది సహకారం అందించాలని కోరారు. ఒంగోలు కలెక్టరేట్‌లో ల్యాండ్ మ్యాటర్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ బదిలీపై మద్దిపాడు తహసీల్దార్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సంతనూతలపాడు: సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో నేడు ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. సంతనూతలపాడు ఎంపీపీ బుడంగుంట విజయ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో పలు రంగాల అభ్యున్నతిపై సమీక్షించనున్నట్టు ఎంపీడీవో తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండలంలోని ప్రభుత్వ శాఖల అధికారులు, కార్యదర్శులు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

బాల్య వివాహాలు నివారించాలి



పేర్నమిట్టలో బాలికల సాధికారతపై సూచనలు చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమా



అమ్మనబ్రోలులో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఉషారాణి

- ఐసీడీఎస్ సంతనూతలపాడు సూపర్‌వైజర్ నాగలక్ష్మి

సంతనూతలపాడు: బాల్య వివాహాల నివారణకు అందరూ పాటుపడాలని ఐసీడీఎస్ సంతనూతలపాడు సూపర్‌వైజర్ పి.నాగలక్ష్మి కోరారు. మండలంలోని గురవారెడ్డిపాలెం సచివాలయంలో శుక్రవారం వేసవి ప్రత్యేక కిశోర్ వికాసం కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. జూన్ 10వ తేదీ వరకు అన్ని సచివాలయాల పరిధిలో కిశోర్ బాలికల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య సంరక్షణ, తదితర వాటిపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోక్సో చట్టం, బాలల హక్కు రక్షణ, బాల్యవివాహాలు, రక్తహీనత తదితర అంశాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ నేరాల గురించి కిశోర బాలికలకు నాగలక్ష్మి అవగాహన కల్పించారు. మండలంలోని ఎండ్లూరు, సంతనూతలపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో, కామేపల్లివారిపాలెం, మంగమూరు, బొడ్డువారిపాలెం గ్రామాల్లో, పేర్నమిట్టలోని 40, 41, 42 సచివాలయాల పరిధిలో కిశోర వికాసంపై కార్యక్రమాలు నిర్వహించగా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆర్.పార్వతీబాయ్, రమాకిశోర్, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు ప్రమాదకరం...

నాగులుప్పలపాడు: బాల్యవివాహాలు ప్రమాదకరంగా మారతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి తెలిపారు.

మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌లో వేసవి సెలవుల సందర్భంగా కిశోర వికాసంపై 11 నుంచి 18 సంవత్సరాల్లోపు బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. చిన్న వయసులో వివాహం చేసుకోకుండా బాగా చదువుకుని ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు చిన్నవయసులోనే వారికి పెళ్లి చేయకుండా బాగా చదివించాలని తెలిపారు. తొలుత బాలికలను పరిచయం చేసుకుని వారి లక్ష్యం ఏమిటని తెలుసుకున్నారు. అదేవిధంగా వినోదరాయునిపాలెంలో కిశోర వికాసం వేసవి సెలవులపై కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ ఘట్టమనేని అశోక్, మహిళా పోలీసు నాగజ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు మార్తమ్మ, చిన్నాయి, జయరాణి, కోటేశ్వరమ్మ, ఆశా కార్యకర్త తిరుమల, ఉప్పుగుండూరులో ఏఎన్ఎం హస్రిఫా, మహిళా పోలీసు విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బత్తులకు సంతనూతలపాడు నాయకుల సన్మానం



బత్తుల బ్రహ్మానందరెడ్డిని సన్మానిస్తున్న దుంపా రమణమ్మ, నాయకులు

సంతనూతలపాడు: వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకునిగా నియమితులైన బత్తుల బ్రహ్మానందరెడ్డిని ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ నాయకులు గురువారం ఒంగోలులోని ఆయన నివాసంలో కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ దుంపా యలమందారెడ్డి, చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖర్‌రెడ్డి, మున్సిపల్ వింగ్ నాయకుడు రావూరి శ్రీనివాసరెడ్డి, ట్రేడ్ యూనియన్ నాయకుడు కాకి రవి, బీసీ సెల్ నాయకుడు గుంజి ఏడుకొండలు, ఇతర నాయకులు కత్తినేని సుబ్బారెడ్డి, రాజేష్, రేపూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా పెన్షన్ల పంపిణీ

- కూటమి ప్రభుత్వ తీరుతో లబ్ధిదారులకు ఇబ్బందులు
- అర్హులందరికీ పెన్షన్లు పంపిణీ ఘనత వైఎస్ జగన్‌ది
- వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి మేరుగు నాగార్జున



మాజీ మంత్రి మేరుగు నాగార్జున

సంతనూతలపాడు: రాష్ట్రంలోని ప్రతి సామాన్య కుటుంబాన్ని ఆదుకున్న ఘనత గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదని, ఆనాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కులం, మతం, ప్రాంతం, రాజకీయ పార్టీ చూడకుండా సంక్షేమ పథకాలను అందరికీ అందించారని ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి మేరుగు నాగార్జున శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం పింఛన్ల పంపిణీ తీరు అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. 2019–24 మధ్య 65 లక్షల పెన్షన్లు పంపిణీ చేయగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం సుమారు 3 లక్షల పెన్షన్లు రద్దు చేసిందన్నారు. కొత్త పెన్షన్లకు దరఖాస్తు చేసే పరిస్థితి ఈ ప్రభుత్వంలో లేదన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పెన్షన్ల పంపిణీకి రూ.32 వేల కోట్లు కేటాయించగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కేవలం రూ.27 వేల కోట్లు కేటాయిస్తోందన్నారు. సామాజిక పెన్షన్లను రాజకీయ కక్షతో రద్దు చేస్తున్నారని, వైఎస్సార్ సీపీకి చెందిన వారికి ఎలాంటి సాయం చేయవద్దంటూ ఇటీవల సీఎం చంద్రబాబు అనడమే అందుకు నిదర్శనమని అన్నారు. అధినాయకుడే అలాంటి వ్యాఖ్యలు చేయడంతో క్షేత్ర స్థాయిలో అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత వివక్ష చూపుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కుల, మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సామాన్య కుటుంబాలకు సామాజిక పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో ప్రజల తరఫున ఉద్యమించేందుకు సిద్ధమవుతామని మేరుగు నాగార్జున స్పష్టం చేశారు.

భక్తిశ్రద్ధలతో శంకర జయంతి వేడుకలు



జగద్గురు ఆదిశంకరాచార్యుల చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు, నిర్వాహకులు



ప్రసన్నాంజనేయస్వామి మహాకుంభాభిషేకం ఆహ్వానపత్రిక అందజేస్తున్న సహాయ కమిషనర్ కార్యనిర్వహణాధికారి తిమ్మానాయుడు

ఒంగోలు మెట్రో: జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలను శుక్రవారం ఒంగోలు నగరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రంగారాయుడు చెరువు దగ్గర శంకరమఠం శ్రీ కంచికామాక్షమ్మ దేవస్థానంలో, శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో, సంతపేట షిరిడీ సాయిబాబా మందిరంలో శంకరాచార్యుల మూల విరాట్లకు సుగంధ పరిమళ ద్రవ్యాలతో ఆలయ అర్చకులు అభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వేద స్మార్త ప్రవర్తక విద్వత్ పరీక్షా పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం కేశవస్వామిపేటలోని లలితాశ్రమం నుంచి భక్తులు జయజయ శంకర హర హర శంకర భజనలతో జగద్గురువు ఆదిశంకరాచార్యుల చిత్రపటంతో నగరంలోని గాంధీ రోడ్డు, పప్పు బజారు, ఏనుగు చెట్టు, తాతా బిల్డింగ్స్ మీదుగా లలితాశ్రమం వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ప్రముఖ వేద పండితులు వంగల కృష్ణమూర్తి అవధాని, పిన్నెల్లి చంద్రశేఖర్ అవధాని ఆధ్వర్యంలో వేద పరీక్షలకు అధికారులుగా వ్యవహరించారు. ఆయా కార్యక్రమాలలో పాల్గొన్న వేద విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, వేద పండితులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నేలబొట్ల సదాశివయ్య, కార్యదర్శి మహంకాళి వెంకట శేషయ్య, జాయింట్ సెక్రటరీ భీమశంకరశాస్త్రి, కోశాధికారి తొండేపి మల్లినాథుడు, సభ్యులు ఆలూరి రామారావు, భారతుల శ్రీనివాసశర్మ, మైనంపాటి సాయికుమార్, వ్యామజాల ప్రసన్నకుమార్, ఓరుగంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు వినియోగిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సుకన్య

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సుకన్య

చీమకుర్తి రూరల్: మత్తు పదార్థాలు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని చీమకుర్తి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుకన్య అన్నారు. శుక్రవారం బండ్లమూడి గ్రామంలోని ప్రజలకు గంజాయి, నాటుసారా, మత్తు పదార్థాల వినియోగంపై కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాలు అమ్మినా, కొనుగోలు చేసినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య శిక్షణ ప్రారంభం



కూచిపూడి నృత్య శిక్షణలో పాల్గొన్న చిన్నారులు

ఒంగోలు మెట్రో: నళినీప్రియ కూచిపూడి నృత్యానికేతన్ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యంపై 45 రోజుల వేసవి శిక్షణ శిబిరాన్ని ఒంగోలు సంతపేటలోని షిరిడీ సాయిబాబా మందిరంలో శుక్రవారం ప్రారంభించారు. ఎస్వీ శేషయ్య అధ్యక్షత వహించి ప్రారంభించగా, మందిరం నిర్వాహకుడు అశహరి చెంచలరావు, సీనియర్ అడ్వకేట్ కృష్ణవేణి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆరేళ్లు నిండిన విద్యార్థులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

కుల గణనతోనే సామాజిక న్యాయం

ఒంగోలు టౌన్: జన గణనతో పాటుగా కుల గణన చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రకాశం జిల్లా గౌడ సంఘం కన్వీనర్ హుసేనయ్య గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుల గణన వలన దేశంలోని ప్రజలందరికీ సమాన న్యాయం జరుగుతుందన్నారు. జనాభా ప్రాతిపదికన ప్రతి కులానికి విద్య, ఉద్యోగం, రాజకీయ, సంక్షేమ ప్రయోజనాలు అందుతాయని అన్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నప్పటికీ నేటికీ చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం లభించకపోవడం బాధాకరమన్నారు. స్థానిక సంస్థలు, కేంద్ర, రాష్ట్ర చట్ట సభల్లో ప్రాతినిధ్యం లేక అన్యాయం జరుగుతుందన్నారు. ప్రస్తుత బిల్లు వలన బీసీల్లోని అన్ని కులాలకు మేలు జరుగుతుందని తెలిపారు.

పేదలకు అన్నదానం

ఒంగోలు మెట్రో: స్థానిక సంతపేటలోని శివం శరణాలయంలో ముప్పూరి చలమయ్య మిత్రబృందం ఆధ్వర్యంలో యువ పారిశ్రామికవేత్త శిద్దా సుధీర్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలు నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మార్నెళ్ల సుబ్బారావు, శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

13 మంది రైజ్ విద్యార్థులకు ఉద్యోగాలు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న రైజ్ కళాశాల యాజమాన్యం

ఒంగోలు సిటీ: ఒంగోలు సమీపంలోని రైజ్ కృష్ణసాయి గ్రూప్ అఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో 13 మంది విద్యార్థులు లుమినా డాటమాటిక్స్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు శుక్రవారం తెలిపారు. కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలకు లుమినా డాటమాటిక్స్ తరఫున హెచ్‌ఆర్ మైఖేల్ హాజరై విద్యార్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, టెక్నికల్ రౌండ్, హెచ్‌ఆర్ రౌండ్ నిర్వహించారు. వాటిలో ఎంపికైన విద్యార్థులు ట్రైనీ ఇంజినీర్ రోల్‌లో లుమినా డాటమాటిక్స్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తారని తెలిపారు. వార్షిక వేతనం రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఉంటుందని కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రఘుబాబు తెలిపారు. లుమినా డాటమాటిక్స్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల గౌరవ చైర్మన్ ఇస్కాల రంగమన్నార్, ట్రెజరర్ శిద్దా భరత్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ భాస్కరరావు, రాగా చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక అభినందించారు.

పదో తరగతి విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేసి అభినందిస్తున్న హెచ్‌ఎం కృష్ణకుమారి, బోధన సిబ్బంది

ఒంగోలు సిటీ: స్థానిక బండ్లమిట్టలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివి పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుక్రవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కొవ్వూరి అక్షర 591, ఎస్‌కే కౌసరున్నీసా 590, నాగజాహ్నవి 582 మార్కులు సాధించి పాఠశాలలో ఫస్ట్, సెకండ్, థర్డ్ స్థానాలను కైవసం చేసుకున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు జి.కృష్ణకుమారి తెలిపారు. వారిని హెచ్‌ఎంతో పాటు ఎస్ఎంసీ చైర్మన్ ముప్వల జగదీష్, పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. మొదటి రెండు స్థానాల్లో నిలిచిన అక్షర, కౌస రున్నీసాలకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. పాఠశాల ఎదురుగా ఉన్న విజయలక్ష్మి స్టీల్ అండ్ హోం అప్లయన్స్ ప్రొప్రైటర్ మోహన్‌లాల్ విద్యార్థులను ప్రశంసించి బహుమతులు అందించారు.

చల్లా నాగేశ్వరమ్మకు బీసీ సంఘాల అభినందనలు



చల్లా నాగేశ్వరమ్మను సన్మానిస్తున్న ఎంపీ, మేయర్, బీసీ సంఘాల నాయకులు

ఒంగోలు మెట్రో: ఉగాది పురస్కార గ్రహీత డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మకు సంగీత నృత్య సాహిత్య నాటక బీసీ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, మేయర్ గంగాడ సుజాత, కళాకారుల సంఘ గౌరవాధ్యక్షుడు మండవ మురళీకృష్ణ, మహిళా కమిషన్ సభ్యురాలు తమ్మిశెట్టి రమాదేవి, మార్నెళ్ల సుబ్బారావు, మస్తాన్‌రావు, మండవ సుబ్బారావు, గుంజి నరసింహం పాల్గొని అభినందించారు. ఆంధ్రప్రదేశ్ వడియరాజుల సంఘ వ్యవస్థాపకుడు తన్నీరు ఆంజనేయులు, ఆలిండియా కళా రంగం ప్రకాశం జిల్లా కళాకారుల కోశాధికారి చల్లా బాలకొండయ్య, తన్నీరు ప్రసాద్ నిర్వాహకులుగా, వ్యాఖ్యాతగా సయ్యద్ ఇస్మాయిల్ వ్యవహరించారు. వీనుల విందైన సంగీత విభావరి నిర్వహించారు. గాయనీ గాయకులు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ, వడ్డంపూడి సుజాత, కే లక్ష్మీప్రసన్న, యు.లక్ష్మీతులసి, కే యశోద, ఆములూరి మనోహర్, డి.కోటేశ్వరరావు, వసంతరావు, హెడ్ కానిస్టేబుల్ తన్నీరు బాలాజీ, ఎంఈఓ ఐ.మురళీకృష్ణ, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తి పరవశం.. బ్రహ్మోత్సవం

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి, పార్వతీ సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. శుక్రవారం చెన్నకేశవ స్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ ఉభయ దాతలుగా కోడూరి, బొర్రా కుటుంబ సభ్యులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకట కృష్ణ కిరణ్, నుదురుపాటి వెంకటకృష్ణారావు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. శనివారం శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీదేవి అమ్మవారు